


హసన్‌బాద హైస్కూల్‌ను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి-రామచంద్రపురం

హసన్ బాదలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ ను జిల్లా విద్యాశాఖ అధికారి కె.కమల కుమారి శుక్రవారం సందర్శించారు. డిఇఒ విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఆమె సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతుల నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల రూపొందించిన భారతదేశ పెయింటింగ్, విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలను డిఇఒ పరిశీలించి ప్రధానోపాధ్యాయులు పిఎస్‌బి ఎస్‌కె.సుందరిని అభినందించారు. డిప్యూటీ డిఇఒ ఎంఎల్.నరసింహఫణి తదితరులు ఉన్నారు.



విద్యార్థి నోట్ పుస్తకాన్ని పరిశీలిస్తున్న డిఇఒ

నిరుపయోగంగా క్షీర సాంకేతికదర్శిని

‣ నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-మండపేట

పశుపోషణలో సాంకేతిక విధానం, మెరుగైన యాజమాన్య పద్ధతులు, అధిక పాలదిగుబడి, పాల ఉత్పత్తులు, పోషక విలువలుగల పశుగ్రాస పెంపకం తదితర అంశాలపై పశుపోషకులకు, పశువైద్యులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన క్షీర సాంకేతికదర్శిని (డెయిరీ టెక్నో పార్కు) నిరుపయోగంగా మారింది. క్షీర సాంకేతికదర్శిని పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తుప్పల్లో పొదలమాటున నిరుపయోగంగా ఉంది. మండపేట పట్టణంలో రాష్ట్ర వ్యాప్తంగా పశువైద్యులు అధ్యయనం చేసేందుకు వివిధ రకాల పశుగ్రాసాల గురించి తెలుసుకుని పశుపోషకులకు సూచించి అధిక పాల దిగుబడి సాధించేందుకు రాష్ట్ర పశు సంవర్ధక శిక్షణ కేంద్రంలో గర్భసంబంధ చికిత్స విధానంపై మెలకువలు తెలుసుకుని నైపుణ్యం సాధించేందుకు రాష్ట్రంలోని 26 జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన పశువైద్యులు ఇక్కడ శిక్షణ పొందేందుకు వస్తుంటారు. సంవత్సరానికి 11 బ్యాచ్‌ల చొప్పున బ్యాచ్ 15 నుంచి 20 మంది శిక్షణ పొందుతుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా పశువైద్యులు అధ్యయనం చేసేందుకు వివిధ రకాల పశు గ్రాసాల గురించి తెలుసుకుని పశుపోషకులకు సూచించి అధిక పాల దిగుబడి సాధించేందుకు పాల ఉత్పత్తులు పెంపునకు 2019లో క్షీరసాంకేతిక దర్శిని ఏర్పాటు చేశారు.



మండపేట తుప్పల్లో నిరూపయోగంగా ఉన్న క్షీర సాంకేతిక దర్శిని(డైరీ టెక్నోపార్కు)

జిల్లా కలెక్టరు నిధులు రూ.50లక్షలు వెచ్చించి 15 షెడ్లు నిర్మించి, దేశంలో వివిధ ప్రాంతాలతోపాటు కరవు ప్రాంతాల్లో సైతం పండే 20 రకాలకు పైగా అధిక పోషక విలువలు గల పశుగ్రాస క్షేత్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. సంప్రదాయ పశుపోషకులు సైతం ఈ విధానాన్ని సక్రమంగా పాటిస్తే ఈ రంగంలో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ వివిధ కారణాలతో క్షీర సాంకేతికదర్శిని పట్ల శ్రద్ధ చూపకపోవడంతో నిరుపయోగంగా మారి ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఇది ఇలా ఉండగా పశువులకు సంక్రమించే వ్యాధులు నిర్ధారణ కోసం ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లో టెక్నీషియన్ పశువులకు సంక్రమించే వ్యాధులు నిర్ధారణకు పరీక్షలు చేస్తుంటారు.



కేంద్రంలో శిక్షణ పొందుతున్న పశువైద్యులు (ఫైల్)

15 షెడ్లలో ప్రత్యేకతలు ఇవీ

ఒక్కో షెడ్డుకు ఒక్కో ప్రత్యేకత ఉంది. వీటిలో దేశవాళీ పశు సంపద, గొర్రెలు, మేకల వివరాలు, పశు పోషణలో యాంత్రీకరణ విధానానికి సంబంధించి పరికరాల ప్రదర్శన, వినియోగించే పద్ధతులు, నీటిపై ఉత్పత్తి చేసే పశుగ్రాసాలు, సైలేజ్, సంచులు, మాగుడుగడ్డి తయారీ. విధానం, యంత్రాలతో పాలు తీయడం, పాలలో వెన్న, పాలతో క్రీము తయారీ, ఇతర ఉత్పత్తుల తయారీ పద్ధతుల గురించి తెలుసుకోవచ్చు. ఇవి కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పశుగ్రాస క్షేత్రంలో 20 రకాల మేలుజాతి గ్రాసం పెంపకం వివరాలు తెలుసుకోవచ్చు.

ల్యాబ్‌లో చేసే పరీక్షలు

పేడ, రక్తం, చర్మవ్యాధి, పాల, మూత్రం, గర్భవాతం, నాసాల్ వాషింగ్, (బయోకెమికల్) లివర్, కిడ్నీ, షుగర్ తదితర పరీక్షలు చేస్తుంటారు. అయితే ప్రస్తుతం బయోకిమిల్ పనిచేయడంలేదు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు



క్షేత్ర స్థాయి సిబ్బంది కొరత కారణంగా డైరీ టెక్నోపార్కు నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఇటీవల కూలీలను పెట్టి తుప్పలు తొలగించాం. వర్షాలకు మళ్లీ పెరిగిపోయాయి. త్వరలో తుప్పలు తొలగించి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తాము.

-డాక్టర్ బి. చంద్రశేఖర్ గౌడ్, జెడి

పశుసంవర్ధక శిక్షణ కేంద్రం, మండపేట

అర్హులకు కేంద్ర పథకాలు అందేలా చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలుతో పాటుగా ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా కూడా అర్హులైన లబ్ధిదారులకు మరింతగా ప్రయోజనం చేకూర్చేందుకు చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శుక్రవారం పేరూరు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం బాగా వెనుకబడిన ప్రాంతమని, తాగునీటి సమస్యలు ఉన్నాయన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరు చేస్తున్న నిధులు స్థానికంగా డెల్టా ప్రాంతం కావడంతో రూ.1.8 లక్షలు గృహ నిర్మాణానికి సరిపోవడంలేదని, యూనిట్ కాస్ట్ ను రూ.5 లక్షల వరకు పెంచాలని, తాగునీటి సమస్య పరిష్కారానికి ధవళేశ్వరం నుంచి ప్రతిపాదించిన వాటర్ గేట్ పథకానికి కేంద్రం సహకరించాలని కోరారు. కేంద్ర ఆర్థిక శాఖ సంచా లకులు శోభిత్ గుప్తా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల అర్హులకు చేర్చాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభించిందని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజల్ని, ముఖ్యంగా కేంద్ర సంక్షేమ పథకాల లబ్ధిదారుల్ని చేరుకుని అర్హులందరికీ ఆ పథకాలు అందేలా చూసేందుకు ముందుగా గిరిజన ప్రాంతాలలో ప్రచారాన్ని ప్రారంభించారన్నారు. వచ్చే ఏడాది జనవరి 25 నాటికి దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాలలో యాత్ర కొనసాగుతుందన్నారు. ప్రతి ప్రచార వాహనం రెండు గంటలపాటు గ్రామ పంచాయతీలో ఉండి, ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి వాటిని అందేలా చూస్తుందన్నారు. దిగువ, మధ్య తరగతి జనాభాకు కేంద్ర పథకాల ప్రయోజనాలను పొందేలా చూడడమే లక్ష్యంగా నిర్దేశించారన్నారు. ఈ సంకల్ప యాత్ర తదితర సంక్షేమ అభివృద్ధి పరకాల ద్వారా 2047 సంవత్సరం నాటికి భారత దేశాన్ని ప్రపంచంలో మూడవ అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని ప్రధానమంత్రి సంకల్పించారన్నారు. ప్రధానంగా 17 రకాల కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ చేరాలన్నదే ముఖ్య సంకల్పమన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ఈ ప్రాంతం బాగా వెనుకబడిన ప్రాంతమని, తాగునీటి సమస్యలు ఉన్నాయని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరు చేస్తున్న నిధులు స్థానికంగా డెల్టా ప్రాంతం కావడంతో రూ.1.8 లక్షలు గృహ నిర్మాణానికి సరిపోవడంలేదని, యూనిట్ కాస్ట్ ను రూ.5 లక్షల వరకు పెంచాలని, తాగునీటి సమస్య పరిష్కారానికి ధవళేశ్వరం నుంచి ప్రతిపాదించిన వాటర్ గేట్ పథకానికి కేంద్ర సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ జి.కేశవర్ధన్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వి.కష్ణ కుమారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు వి.శివ శంకర్ ప్రసాద్, యాళ్ల దొరబాబు, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, జెడ్‌పిటిసి సభ్యుడుపందిరి శ్రీహరి, సర్పంచ్ దాసరి అరుణ, ఉప సర్పంచ్ కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పేరూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ధాన్యం దిగుమతి చేయాలని రైతుల నిరసన

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని లొల్ల సత్తి రామకృష్ణారెడ్డి రైస్ మిల్లులో ధాన్యం లోడు దిగుమతి చేయాలంటూ శుక్రవారం రైతుల నిరసన వ్యక్తం చేశారు. వారి వివరాల ప్రకారం.. అంకంపాలెం గ్రామానికి చెందిన కుదప శ్రీ కృష్ణ భగవాన్ తన మూడు ఎకరాల పొలంలో పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రంలో నమోదు చేయించుకుని వ్యవసాయ శాఖ సిబ్బంది అనుమతితో లారీలో ఎగుమతి చేసి లొల్ల మిల్లుకు 23వ తేదీ ఉదయం 10 గంటలకు తరలించాడు. మిల్లు వద్ద ఉన్న కస్టోడియన్ అధికారి జిపిఎస్ ఆన్లైన్ లారీకి అనుసంధానం అవ్వడం లేదంటూ ధాన్యాన్ని దిగుమతి చేయకుండా నిలుపుదల చేశారు. దీంతో శుక్రవారం సాయంత్రం వరకు ధాన్యం లారీలో ఉండిపోవడంతో లారీ ఓనర్ అదనంగా రూ.10 వేలు ఇవ్వాలని లేదా తక్షణమే ధాన్యాన్ని దిగుమతి తీసుకోవాలంటూ డిమాండ్ చేయడంతో అంకపాలెం గ్రామ రైతులు నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే ధాన్య దిగుమతి చేయాలని, జిపిఎస్ అనుసంధానం లేకుండా నేరుగా కల్లాల వద్ద నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. జిపిఎస్ సాంకేతి సమస్యను పరిష్కరించి ధాన్యం మిల్లుకు తరలినట్టుగా కంప్యూటర్ నిక్షిప్తం చేసి దాని బస్తాలు దిగుమతి చేయడంతో రైతులు నిరసన విరమించారు.



నిరసన తెలుపుతున్న అంకపాలెం గ్రామ రైతులు

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక యుటిఎఫ్ హోమ్ నందు శుక్రవారం ఉప్పలగుప్తం మండల యుటిఎఫ్ నూతన కౌన్సిల్ సమావేశం యుటిఎఫ్ నాయకులు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పెంకే వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబసు రాష్ట్ర కార్యదర్శి రాఘవులు పాల్గొన్నారు. సమావేశంలో యుటిఎఫ్ ఉప్పలగుప్తం మండల శాఖకు 2023-24 సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉప్పలగుప్తం మండల అధ్యక్షునిగా అత్తిలి సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి గా చంద్ర సూర్యం, కోశాధికారిగా బుజ్జి బాబు, గౌరవ అధ్యక్షులుగా పద్మనాభన్‌ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాంప్రసాద్, వేణుగోపాల్, శర్మ, ధర్మారావు, రుద్ర మల్లేష్, శ్రీనివాస్, విశ్వప్రసాద్, కామేశ్వరరావు, కేశవరావు, త్రినాథ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గురుకుల పాఠశాల్లో దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-అమలాపురం(అల్లవరం)

అల్లవరం మండలం గోడి బాలికల గురుకుల పాఠశాల్లో తాళ్ల సరస్వతమ్మ ముత్యాలు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎపి ఐ అండ్ ఐ స్పెషల్ సెక్రటరీ తాళ్ళ సత్యనారాయణ మూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం టెన్త్ విద్యార్థినులకు మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. శార్వి డెంటల్ కేర్ నుంచి డాక్టర్ యర్నాగుల చంద్రమౌళి, డాక్టర్ యనమదల పూజిత విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిం చారు. దంత సమస్యలతో బాధపడుతున్న విద్యార్థినులకు వైద్యం చేయిస్తామని ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తాళ్ల పల్లేశ్వరరావు అన్నారు. ట్రస్ట్ సెక్రటరీ తాళ్ల సత్యనారాయణ మూర్తిని ఎంపిడిఒ కష్ణ మోహన్, ఎంఇఒ కిరణ్ బాబులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ తాళ్ళ సాంబమూర్తి, ప్రిన్సిపల్ కిరణ్మయి, నాతి శ్రీనివాసరావు, మంగం నాగభూషణం, గుణిశెట్టి చినబాబు, పల్లి జేమ్స్, బొంతు శ్రీను, బొక్కా నాని, కాంద్రేగుల రామ సత్యనారాయణ, చింతా సంపద రావు, రొక్కాల బాపూజీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కార్మిక రైతు సంఘాల నాయకులు

మహాధర్నా జయప్రదానికి పిలుపు

కార్మిక రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి అమలాపురం

అమలాపురం యుటిఎఫ్ ఎంప్లాయిస్ హోమ్ వద్ద శుక్రవారం కేంద్ర కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్ష వహించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కర్షక, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జింఖానా గ్రౌండ్ లో జరిగే మహా ధర్నాకు కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న హక్కుల కోసం కార్మికులు కర్షకులు సంఘటితమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు సత్తిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రరావు అధ్యక్షులు వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం వెంకటేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు రాంబాబు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నిమ్మకాయల వెంకటేష్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శంకర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నిమ్మకాయల శ్రీను, అంగన్‌వాడీ జిల్లా కోశాధకారి అమూల్య, బేబీ గంగ రత్నం, విత్తనాల రాంబాబు, రామకృష్ణ, విజయ ఆశ వర్కర్ యూనియన్ నాయకులు ఈశ్వరి, భువనేశ్వరి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మండలంలోని గోగుల్లంక సచివాలయం వద్ద ఏపికి జగన్ ఎందుకు కావాలి పల్లెకు పోదాం రా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు ఈతకోటి సత్యనారయణ ఆధ్వర్యంలో ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్‌పిటిసి సభ్యులు ముదునూరి సతీష్ రాజు మాట్లాడుతూ వైసిపి పాలనలో అందించిన అభివద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ముందుగా మా నమ్మకం నువ్వే జగన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డిజిటల్ సంక్షేమ పథకాలు బోర్డు ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇసుకపట్ల అచ్చిబాబు, లంకే ప్రసాద్, పడాల సత్యనారయణ, ములపర్తి శ్రీరాములు, చోడిశెట్టి సత్తియ్య నాయుడు, యాళ్ళ సూరిబాబు, పోతుల నాగబాబు పాల్గొన్నారు.



గోగుల్లంకలో జెండా ఆవిష్కరిస్తున్న జెడ్‌పిటిసి సతీష్‌రాజు

ఇంటి ముంగిటికే సంక్షేమ పథకాలు



ఎన్.కొత్తపల్లిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సంపదరావు

ఉప్పలగుప్తం సిఎం జగన్ పాలనలో ఇంటి ముంగిటకే అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు ఉన్నారు. ఎన్.కొత్తపల్లి సచివాలయం-1 లో శుక్రవారం వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించి సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపిటిసి సభ్యుడు కొంకి ఏడుకొండలు, సచివాలయాల మండల కన్వీనర్ కోటుం లోవరాజు, వైసిపి యువజన,బి సి విభాగాల మండల అధ్యక్షులు ఓగూరి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే వైసిపి ప్రభుతం లక్ష్యం

మండపేటసంక్షేమం, అభివృద్ధి వైసిపి ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి, ఎంపిపి ఉండమట్ల వాసు, వైసిపి రాష్ట్ర నాయకులు దూలం వెంకన్నబాబు, పాపారాయుడు, ఎంఎల్‌సి తోట తనయుడు యువ నాయకుడు తోటా పథ్వి అన్నారు. శుక్రవారం మండపేట పట్టణ, మండలంలోని కేశవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఇంటి ఇంటికి వెళ్లి సిఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలన గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల అభివద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు మెండు బాపిరాజు, శెట్టి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

బాబు పాలన కోసం ప్రజల ఎదురుచూపు

ప్రజాశక్తి-మామిడికుదురు(పి.గన్నవరం)

చంద్రబాబు పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని రామచంద్రపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లి సర్పంచ్ ప్రతిపాటి ఉమామహేశ్వరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం చాకలిపాలెం సెంటర్ గటిగంటి శ్రీనివాస్ కాంప్లెక్స్ నందు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ను పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, నామన రాంబాబులు ప్రారంభించారు. ఉండవల్లి మూర్తి, రామ్మూర్తి కుమారుడు శ్రీకాంత్ ఆర్థిక సాయంతో అన్న క్యాంటీన్ నిర్వహించారు. ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని గత టిడిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు నిర్వహించగా పేదల ఆదరణ చూడలేక అధికారం చేపట్టిన వెంటనే వైసిపి ప్రభుత్వం దుర్మార్గపు చర్యగా అన్న క్యాంటీన్లు ధ్వంసం చేసిందన్నారు. జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, వైస్ ఎంపిపి చెల్లుబోయిన గంగాభవాని, టిడిపి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చాకలిపాలెంలో అన్న క్యాంటిన్ ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

సాహితీ పురస్కార గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్


శ్రీ వెంకటేశ్వరా కళాశాల తెలుగు ఉపన్యాసకులు సంసోనును శుక్రవారం స్థానిక కళాశాల్లో సెక్రటరి అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎన్.నరసింహారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సాహితి కళాపీఠం అంబాజీపేట వారు నిర్వహించిన హాస్య కవితల పోటీలలో ఎస్.సంసోనుకు సాహితీ పురస్కారం దక్కిందన్నారు. ఈ పోటీల్లో డాలర్ మోజులో పడి మాత దేశాన్ని గుండెల మీద తన్ని పరాయి దేశాలకు వలస పోతున్న మేధావుల ధనదాహం మీద రాసిన రంగులకు అనే కవితకు జిల్లా ప్రథమ స్థానం లభించిందనీ అన్నారు.

సంసోను ను జ్ఞాపిక, ప్రశంసా పత్రం, రూ.5116 నగదు బహుమతితో అరిగెల బలరామమూర్తి కళాపీఠం ఘనంగా సత్కరించింది. బుద్దాల వెంకట రామారావు, డా.కత్తి మండ ప్రతాప్, బివివి. సత్యనారాయణ, పచ్చిగళ్ళ సుధ, ఆర్టిస్టు ఆశీర్వాదం, పలువురు సాహితి ప్రముఖుల ప్రసంశలు ఆయన అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కెఎస్‌విఎన్.మనోహర్, సేవారత్న, డొక్కా సీతమ్మ అవార్డు గ్రహీత కరాటం ప్రవీణ్, వరప్రసాద్, వెంకటేశ్, నాగరాజు, ఎండీ శ్రావణ్ దిలీప్, డా. హేమ విజిత తదితరులు పాల్గొన్నారు.



సంసోను ను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

కార్టూ'నిజం'



30 శాతం పూర్తయిన కోతలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

అల్పపీడనాల కారణంగా కురుస్తున్న వర్షాలకు తొలకరి రైతులు విలవిలాడుతున్నారు. వరి కోతలు ముమ్మరంగా ఉన్న సమయంలో మళ్లీ కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో తొలకరి పనులు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి. కె.గంగవరం మండలంలోని 15 వేల ఎకరాల్లో వరి సాగవుతుండగా దీనిలో 30 శాతం కోతలు పూర్తయ్యాయి. ఇ ప్పటి వరకు 4450 ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్లు మండల వ్యవసాయ అధికారి బలుసు రవి తెలిపారు. అదేవిధంగా ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం 2,180 మెట్రిక్ టన్నులు మిల్లులకు చేరవేయగా, రైతులు నేరుగా ఒక వెయ్యి 170 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు కోతలు వాయిదా ఎప్పటికీ కోతలు పూర్తయిన ధాన్యాన్ని రైతులు రోడ్ల వెంబడి బరకాలు కప్పి ఉంచుకున్నారు. ఈ వర్షాలు ఎప్పటికీ తగ్గుతాయోనని రైతులు ఆందోళన చెందు తున్నారు. ఇప్పటకే రెండుసార్లు అల్పపీడనాలు ఏర్ప డడంతో అధిక శాతం తొలకరి వరిచేలు నేలకొరిగి పో యాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు భారీగా కురిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బరకాలు కప్పి ఉంచిన ధాన్యం

కపిలేశ్వరపురంలో ఇసుక దోపిడీ

ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

ప్రజాశక్తి-మండపేట

కపిలేశ్వరపురం మండలంలో ఇసుక దోపిడీ జరుగుతోందని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజుల నుంచి ఈ దోపిడీ జరుగుతోందని ఇప్పటివరకు 7 వందల లారీల ఇసుక తరలించారన్నారు. రామచంద్రపురంలో దోపిడీని తట్టుకోలేక ఆయనను ఇక్కడికి గెంటివేస్తే ఇక్కడ వచ్చి కేశవరంలో గ్రావెల్, ఇసుక దోపిడీ చేస్తూ సెటిల్మెంట్ల ద్వారా రూ.కోట్లు దండుకుంటున్నారని అన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, తహశీల్దారులను అడిగినా సమాధానం చెప్పడం లేదన్నారు. గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ముందుగా గ్రామంలోని నాయకులతో మాట్లాడుకుని దోపిడీకి రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. సిఎం జగన్ విషయం తెలుసుకుని దోపిడీని అడ్డుకోవాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతూన్న ఎంఎల్ఎ వేగుళ్ల

కె.గంగవరంలో నేత్రదానం

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని కె.గంగవరం గ్రామం లో చింతా రవీంద్రనాథ్ (66) మరణానంతరం ఆయన కళ్ళను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఇటీవల అనారోగ్యం కారణంతో మరణించిన రవీంద్రనాథ్ భార్య చిన్నారి, కుమారులు రాజాచంద్రశేఖర్, రాజేంద్రకుమార్, కుమార్తెలు రజిని గ్రెస్, శాంతి అంగీకారం తో నేత్ర దానం చేశారు. కాకినాడ చెందిన బాదం బాలకష్ణ ఐ బ్యాంకు సిబ్బంది కార్నియాలను సేకరించారు. ఈ గ్రామంలో ఇప్పటివరకు 30 మంది నేత్రదానం చేశారని యువకులు తెలిపారు. సమాజంలో అందరిని చైతన్య పరిచి నేత్రదానం చేసేందుకు ఒప్పించాలని, ఒకరు నేత్రాలను దానం చేస్తే ఇద్దరికి కంటిచూపు ఇచ్చిన వారవుతారని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.



రవీంద్రనాథ్(ఫైల్‌ఫొటో)

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పరిధిలోని జి.వేమవరం పంచాయతీ రామాలయంపేటకు చెందిన ఎర్రమనీడి వెంకటరమణ (51) శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందారు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇంటి పెరట్లో ఉన్న విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కొట్టి వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రవికుమార్ తెలిపారు.



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

కారు ఆటో ఢీకొని ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి వద్ద జాతీయ రహదారి 216పై శుక్ర వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ నుంచి వస్తున్న కారు యానాం వైపు నుంచి ప్రయాణికులతో వెళుతున్న ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న పెదబొడ్డ వెంకటాయపాలెం పాఠశాల హెచ్ఎం నడింపల్లి వెంకటరాజు కారులో బెలూన్‌లు ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆటోలో ఉన్న ఆరుగురు ప్రయాణికుల్లో యానాంకు చెందిన ఆటో డ్రైవర్ సంగాడి వెంకట నరసింహ స్వామి, కోరంగి ఫార్మసీ కళాశాల విద్యార్థి పోతనపల్లి మోహిత్, యానాంకు చెందిన ప్యాసింజర్ పెసింగి జగ్గారావు, తెనాలి కూచిపూడి గ్రామానికి చెందిన దేవరకొండ రాజేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఇదే గ్రామానికి చెందిన పెమ్మాడి రానివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసం కాగా కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కోరంగి ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై విశ్రాంత ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ నాయకులు కె.పద్మనాభం, ఎస్.ఇబ్రహీం, హెచ్‌సి.సుబ్రహ్మణ్యం, శాస్త్రి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కాకినాడ సిటీ ఎంఎల్ఏ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని సిఎంకి సిఫార్సు చేయాలని, ప్రతినెలా 1నపింఛను చెల్లించాలని, తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం కృషి

ప్రజాశక్తి- పెద్దాపురం

రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య సేవా సంఘ భవనంలో తహశీల్దారు జితేంద్ర అధ్యక్షతన నిర్వహించిన సభలో సుమారు 300 మందికి భూ బదలాయింపు హక్కు పత్రాలు ఆయన పంపిణీ చేశారు. ఆర్‌డిఒ జె.సీతారామారావు మాట్లాడుతూ అర్హులందరికీ ఈ పట్టాల పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల మానవత్వంతో మెలగాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వంతో మెలగాలని సీనియర్ సిటిజన్స్ ఇన్విజిలేటర్ పి.శ్యామ్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయ ఆవరణలోని స్త్రీ శక్తి భవనంలో సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన 'వృద్ధుల పోషణ, రక్షణ, సంక్షేమ చట్టం'పై జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎపిఎం పి.సూర్యనారాయణ, పి.సుధాకర్, టి.సత్యనారాయణ, వి.శ్యామల, బి.కృష్ణ, జామి అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన ఆహారం అందించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం నాణ్యతను మరింత పెంచాలని ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం ఎస్ఎఫ్ఐ బృందం విద్యార్థులకు అందజేసిన భోజనాన్ని పరిశీలించింది. అనంతరం వారు మాట్లాడుతూ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా విద్యార్థులకు ఈ భోజనాన్ని సరఫరా చేస్తున్నారన్నారు. భోజనం చాలా నాసిరకంగా ఉందన్నారు. అధికారులు పరిశీలనకు వస్తారని తెలిసిన రెండు రోజులపాటు భోజనం బాగుంటోందని, మిగిలిన రోజుల్లో మామూలేనని వారు తెలిపారు. భోజనం బాగుండకపోవడంతో చాలామంది విద్యార్థులు స్కూల్లో భోజనం చేయడం లేదని ఇళ్లకు వెళ్లిపోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ హైస్కూల్లో నాణ్యమైన భోజనాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వై.గోపాల్, బి.జగదీష్, జి.రాజు పాల్గొన్నారు.

పద్మనాభం కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం(అల్లవరం)

బెండమూర్లంక పాలగుంట చెరువు గ్రామంలో ఎస్‌సి నాయకులు మోకా పద్మనాభం ఇటీవల గుండెపోటుతో మరణించారు. మృతుని కుటుంబాన్ని విజయవాడ సిటీ ఎసిపి మోకా సత్తి బాబు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పద్మనాభం చిత్ర పటం వద్ద నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాతి శ్రీనివాసరావు, రేవు సుందర రావు, పల్లి జేమ్స్, తాడి రాజకిరణ్, పరమట నాని, తాడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పంపా తీరంలో సత్యదేవుని తెప్ప ఉత్సవం

ఘనంగా సత్యదేవుని తెప్పోత్సవం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం సత్యదేవుని తెప్ప ఉత్సవం పంపా నదిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ద్వాదశి సందర్భంగా సత్యదేవుని కొండదిగువున పంపా సరోవరం తీరం వద్ద ప్రత్యేక వేదికపై ఉంచారు. ఎంఎల్ఎ పర్వత పూర్ణ చంద్రప్రసాద్, దేవస్థానం ఇఒ రామచంద్రమోహన్, చైర్మన్ రాజా ఐ.వి రోహిత్ సమక్షంలో అర్చకులు, వేద పండితులు పూజలు నిర్వహించారు. అనంతరం హంస వాహనంపై తెప్ప ఉత్సవం నిర్వహించారు.



కాకినాడలో ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

రైతులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

జగ్గంపేటలో సాగు నీరు లేక పంటలు ఎండిపోయి కరువుతో రైతులు అల్లాడుపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో మధు మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావంతో తీవ్ర కరువ పరిస్థితిని ఎదుర్కొంటున్న మండలాలన్నింటినీ కరువు ప్రాంతాలుగా ప్రకటించి యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల్లో సుమారు 470 మండలాల్లో ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదై తీవ్ర కరువు పరిస్థితులు నెలకొంటున్నట్లు కనిపిస్తున్నాయిని చెప్పారు. వర్షాభావంతో దెబ్బతిన్న ఆహార పంటలకు ఎకరాకు రూ.50 వేలు, వాణిజ్య పంటలకు రూ.75 వేలు, ఉద్యాన పంటలకు రూ.లక్ష నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ ధర్నాలో కె.బోడకొండ, తోకల ప్రసాద్, పి.సత్యనారాయణ, పప్పు ఆదినారాయణ, రామారావు, సత్య, సుబ్బమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు ప్రత్తిపాటి, ఎంఎల్ఎ గోరంట్ల

రానున్నది టిడిపి, జనసేన ప్రభుత్వమే

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రంలో రానున్నది టిడిపి, జనసేన పార్టీల ప్రభుత్వమేనని టిడిపి మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి వెల్లడించారు. శుక్రవారం కాకినాడలోని టిడిపి జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్ర 27వ తేదీ ఉదయం పది గంటల నుంచి పొదలాడలో ప్రారంభం అవుతుందని అదే రోజు సాయంత్రం తాటిపాకలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సిఎం జగన్ ఆధ్వర్యంలో మాఫియా పాలన నడుస్తోందన్నారు. ఆయన నివాసం ఉంటున్న తాడేపల్లికి రూ.50 కోట్ల మద్యం, ఇసుక ఇతర రంగాలకు చెందిన అక్రమ సొమ్ము వెళుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందన్నారు. 14 ఏళ్ల పాటు రాష్ట్రానికి సిఎంగా పనిచేసిన చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టించి జగన్ నవ్వుల పాలయ్యారన్నారు. ఇప్పటి వరకు కోర్టులకు సరైన ఆధారాలను సమర్పించలేదన్నారు. త్వరలో వైసిపి ప్రభుత్వం పోతుందని, రాష్ట్రంలో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, నాయకులు వనమాడి వెంకటేశ్వరరావు, చిక్కాల రామచంద్రరావు, వరుపుల సత్యప్రభ, పిల్లి అనంతలక్ష్మి, మల్లిపూడి వీరు, మోకా ఆనంద్ సాగర్, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న ఆదిత్య విద్యార్థులు

వ్యాసరచనలో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కాకినాడ

సత్య సాయి సేవా సంస్థ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఆదిత్య విద్యార్థులు చక్కని ప్రతిభ కనపరిచారని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. విద్యలో మానవత, నైతిక విలువలు పెంపొందించాలనే ఉద్దేశంతో సత్యసాయి సేవా సంస్థలు 'మానవత్వమును పెంపొందించే విద్యావశ్యకత' అనే అంశంపై విద్యార్థులకు గత నెలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో జరిగిన ఈ పోటీల్లో ఆదిత్య విద్యార్థులు ఎం.ఆదిలక్ష్మి ప్రథమ, కె.శ్రీదుర్గ తృతీయ స్థానాల్లో నిలిచారు. విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు, సత్యసాయి సేవా సంస్థలు స్టేట్ ఫ్యాకల్టీ డాక్టర్ డిఎస్‌డి.శ్యామల, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్చార్జ్ మూర్తి, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ తేజేశ్వరరావు, దివాకరరావు అధ్యాపకులు అభినందించారు.

యానాం వార్తలు

కనకాలపేట వరకు బస్సు వేయాలని వినతి

ప్రజాశక్తి - యానాం

యానాం పిఆర్‌టిసి బస్సును కనకాలపేట వరకు నడపాలని కనకాలపేట యూత్ సభ్యులు పరిపాలనాధికారి మునిస్వామికి శుక్రవారం వినతిపత్రం అందించారు. కనకాలపేట నుండి ప్రజలు ప్రభుత్వ ఆఫీసులకు, హాస్పిటల్స్, కూలి పనులకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి కనకాలపేట వరకు బస్సు నడపాలని కోరారు. ఈ బస్సు కనకాల పేట నుండి సావిత్రి నగర్ వరకు నడపవలసి ఉండగా కేవలం యానాం సావిత్రి నగర్ మాత్రమే నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కనకాలపేట యూత్ ప్రెసిడెంట్ కోన ఆదినారాయణ, కర్నేడి ప్రసాద్, కోన వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - యానాం

యానాం శివారు సావిత్రి నగర్‌లో మద్యం స్వాధీనం చేసుకుననట్టు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. సావిత్రి నగర్‌లో అరదాడి వీరేష్‌కు సంబంధించిన రూ.40 వేలు విలువ చేసే మద్యాన్ని మద్యాన్ని పెమ్మాడి నూకరత్నం ఇంట్లో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బీర్ బాటిల్స్ 13 కేసులు, ఐదు కేసులు లిక్కర్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



శంకుస్థాపన చేస్తున్న దొరబాబు

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. రాయభూపాలపట్నంలో శుక్రవారం ఆయన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి, సిమెంట్ డ్రైన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిధులు కేటాయిస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ముత్యాల రాజబ్బాయి, పిఎసిఎస్ చైర్మన్ నల్లల నాగేంద్రబాబు, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, సర్పంచ్ చీకట్ల లక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పుట్టా వెంకటరావు, చీకట్ల సత్తిబాబు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో శృంగార వల్లభ స్వామి ఆలయంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణానికి సైరస్ ఇండస్ట్రీస్ అధినేత బండా వెంకట కష్ణారావు, పద్మావతి దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు కుంచే వెంకటరమణ, అడబాల జగ్గారావు, అడబాల శివ, అర్చకులు పెద్దింటి నారాయణచార్యులు, పురుషోత్తమాచార్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సిడిపిఒ ఉషకు సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

సిడిపిఒకు అంగన్‌వాడీల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - పెద్దాపురం

సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబర్ 8 నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నట్లు శుక్రవారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉషకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం కాళే దేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తలారి నాగమణి మాట్లాడుతూ తెలంగాణ కంటే ఎక్కువ వేతనం ఇస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేయటం మానేసి అంగన్వాడీలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలన్నారు. అంగన్వాడీలు చేపట్టబోయే సమ్మెకు ప్రజలందరూ మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్, నీలపాల సూరిబాబు, టిఎల్.పద్మావతి, జ్యోతి, తులసి, లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

మారేడుబాకలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని మారేడుబాక గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వైసిపి పాలనలో ఉపాధిలేక యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. టిడిపి ధినేత చంద్రబాబుతోనే యువత భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తుందన్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకొస్తే అన్ని వర్గాలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



దాళ్వా సాగుపై రైతులకు ఆటో మైక్ ద్వారా ప్రచారం చేపడుతున్న దృశ్యం

దాళ్వా సాగు త్వరగా చేపట్టాలని ప్రచారం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మార్చి 31వ తేదీ నాటికి గోదావరి కాల్వలు మూతపడనున్న దృష్ట్యా మండల పరిధిలో రైతులు దాళ్వా పంట సాగు సత్వరమే చేపట్టాలని కోరుతూ గ్రామాల్లో శుక్రవారం ఆటో ద్వారా ప్రచారం చేపట్టారు. రైతులు సత్వరమే జాప్యం లేకుండా దాళ్వా సాగుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ ప్రచారం చేపట్టారు. గోదావరి కాల్వలు మార్చి31 తేదీ నాటికి నిలిపివేస్తారని, కావున బొండాలు రకం వారి సాగును డిసెంబర్ మొదటి వారం లోపు వెదజల్లు, చివరి వారం లోపు ఉడ్పు చేసుకోవాని, లేని పక్షంలో ఎంటియు 1121, ఎంటియు 1153 రకాలను వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు వెంకట సతీష్, శాంతి కమల, రిలయన్స్ నాగేశ్వరరావు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బేడ, బుడగ జంగాలను ఎస్‌సిలుగా గుర్తించాలి

కలెక్టర్ కు వినతి

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల గణన జనాభా లెక్కల్లో బేడ, బుడగ జంగాలని ఎస్‌లుగా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న బేడ,బుడగ జంగాలు, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లా ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బుడగ జంగాల జిల్లా అధ్యక్షులు పేర్ల దుర్గాప్రసాద్ తమకు ప్రభుత్వం ఎస్సీలుగా గుర్తించి కుల ధృవీకరణ పత్రాలు అందించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొం టున్నా మన్నారు. తమకు కుల ధ్రువీకరణ లేదనే నెపంతో సంక్షేమ పథకాలు అందించడం లేదని వాపోయారు తమ పిల్లలు చదువుకునే సందర్భంలో కుల ధృవీకరణాలు పత్రాలు లేకపోవడం వల్ల చదువు మధ్యలోనే ఆగిపోతున్నాయని వివరించారు తమ బిడ్డలకు సైతం సంక్షేమ పథకాలు అందడం లేదని తెలిపారు సమాజంలో ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా వెనకబడి అనేక రకాల వివక్షను ఎదుర్కొంటున్న మేము గత 15 సంవత్సరాలు పైగా కుల ధృవీకరణ పత్రాలు లేకుండానే జీవిస్తున్నామని దీనిపై అనేక సందర్భాలలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు అందించలేదన్నారు. వీరికి మద్దతుగా మాజీ ఎంఎల్ఎ మానేపల్లి అయ్యోజీవేమ, దళిత ప్రజాసంఘాల నాయకులు ఇసుక పట్ల రఘుబాబు, రేవు తిరుపతిరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు దొరబాబు తదితరులు కలెక్టర్ కలిసి వేడ బుడగజంగాలు పడుతున్న ఇబ్బందులను వివరించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ జరుగుతున్న కుల గణన జనాభా లెక్కల్లో వెబ్ ఆప్షన్ లో బేడ బుడగ జంగాలను చేరుస్తామని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సూచించిన వెంటనే ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగ జంగంజిల్లా ఉపాధ్యక్షులు, ముగ్గ నాగేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు, ముగ్గ పెద్దిరాజు, కళ్యాణ్ దుర్గం రాజు తదితరులు పాల్గొన్నారు..



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

గైనకాలజిస్ట్ సత్యవతి మృతికి సంతాపం

ప్రజాశక్తి-మండపేట

గైనకాలజిస్ట్, సమాజ సేవకి డాక్టర్ పాలడుగు సత్యవతి (87) బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈమె మృతికి ప్రముఖులు సంతాపం తెలిపారు. 1960లో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పాలడుగు చంద్రమౌళితో వివాహం కాగా 1962 నుండి మండపేట పట్టణంలో వైద్య సేవలు ప్రారంభించారు. 1967 - 68లో అత్యధిక కుటుంబ ఆపరేషన్లు చేసినందుకు గాను ఆమె ముఖ్యమంత్రి అవార్డు అందుకున్నారు. 1979లో స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో జెడ్‌పి బాలికోన్నత పాఠశాలను సొంత నిధులతో నిర్మించడంతో దానికి డాక్టర్ పాలడుగు చంద్రమౌళి సత్యవతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా నామకరణం చేశారు. 1981లో కౌన్సిలర్‌గా నెగ్గి రాజకీయంగాను సేవలందించారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమె మృతికి ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, ప్రముఖులు సంతాపం తెలిపారు. సత్యవతి అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని డాక్టర్ చంద్రమౌళి తెలిపారు.



డాక్టర్ సత్యవతి(ఫైల్ ఫోటో)

'వికసిత్ భారత్' విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-అమలాపురం

వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా చక్కటి ప్రణాళిక సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని కేంద్ర ఆర్థిక సంఘ సంచాలకులు శోభిత్ గుప్తా జిల్లా స్థాయి అధికారులను కోరారు. శుక్ర వారం స్థానిక కలెక్టరేట్లో జిల్లాస్థాయి అధికారులకు వికసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమాల నిర్వహణ తీరు పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ యోజన, దీన దయాల్ అంత్యోదయ యోజన, జాతీయ గ్రామీణ కార్యక్రమాలు పీఎం ఉజ్వల యోజన, పిఎం కిసాన్, జలజీవన్ మిషన్, అటల్ పెన్షన్ యోజన, జన్ ధన్ యోజన వంటి 17 రకాల కార్యక్రమాలపై జిల్లాకు కేటాయించిన మూడు వాహనాల ద్వారా కార్యక్రమాల నిర్వహణకై కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఈ వాహనాలకు జియో ట్యాగింగ్ ఉంటుందని వాహనాల ద్వారా ప్రచార సామాగ్రి కరపత్రాలు తోపాటు ప్రధానమంత్రి మెసేజి వీడియో ద్వారా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. వేదికలను రైతులు ఎక్కువగా ఉన్నచోట్ల ఎంపిక చేసి రైతు వారి కార్యక్రమాలు ఫోకస్ చేస్తూ స్ఫూర్తిదాయకమైన చైతన్యాన్ని ప్రజల్లో తీసుకుని రావడంతో పాటుగా వాలంటీర్ వ్యవస్థ ద్వారా వివిధ పథకాలు ఇంకా పొందకుండా మిగిలి ఉన్న లబ్ధిదారులను నమోదు చేసే ప్రక్రియ చేపట్టి లబ్ధిని చేకూర్చాలని సూచించారు. అదేవిధంగా రోజువారి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల స్పందనను నోడల్ అధికారి యాప్ లో డేటా ఎంట్రీ చేసి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరూరు గ్రామం నుండి శుక్రవారం ఆరంభమైందన్నారు. ముందుగా వాహనం ద్వారా గ్రామాలలో 17 పథకాల అమలు విధి విధానాలు పట్ల అవగాహన పెంపొందించే విధంగా స్ఫూర్తిదాయకమైన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ మరో వైపు మారుమూల గ్రామాల సైతం పథకాల లబ్ధిని పొందకుండా మిగిలి ఉన్న వారిని నమోదు చేసి లబ్ధిని పొందే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ, జిల్లాస్థాయి నోడల్ అధికారిగా జిల్లా పంచాయతీ అధికారి, మండల స్థాయిలో నోడల్ అధికారిగా ఎంపిడిఒ, స్వాగత్, ఉత్సవ కమిటీలు, పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు.. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణపై మండలంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయాల వాలంటీర్లతో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి మాట్లాడుతూ కేంద్ర సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమ లలో పంచాయతీరాజ్ ఆర్ డబ్ల్యుఎస్ ఎస్‌సిలు కె.చంటిబాబు సిహెచ్ ఎన్‌వి.కృష్ణారెడ్డి, డి ఆర్ డి ఏ పి డి వి శివశంకర్ ప్రసాద్ పశు సంవర్ధక శాఖ జేడి కే వెంకట్రావు వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.